క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఔదార్యం



అంబాజీపేట హైస్కూల్‌లో భూమిపూజ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వరలక్ష్మి

అంబాజీపేట: చదివిన పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో దాతల సహకారంతో సైకిల్ షెడ్‌కు హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన భూమిపూజను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1992–93 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.2.50 లక్షలతో సైకిల్ షెడ్డును నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, అరిగెల బలరామమూర్తి, కొర్లపాటి గోపి, గణపతి వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

మలికిపురం: గుడిమెళ్లంక గ్రామ మల్రిపేటలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన ఆరుగురు విద్యార్థులకు గ్రామానికి చెందిన కడలి సుభద్ర నరసింహమూర్తి చారిటబుల్ ట్రస్ట్ తరఫున నగదు ప్రోత్సాహం అందించారు. గురువారం ట్రస్ట్ కార్యాలయంలో ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున ప్రోత్సాహకం అందించారరు. ట్రస్ట్ చైర్మన్ కడలి బాబూరావు, సభ్యులు శ్రీహరి రాజు, కట్టా పూర్ణ సత్యనారాయణ, గుబ్బల సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ, కడలి కృష్ణార్జునుడు, దొంగ సత్తిబాబు, చిట్టూరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందించాం

మామిడికుదురు: ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలన అందించిందని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు తెలిపారు. కూటమి ఏడాది పాలనను పురస్కరించుకుని మామిడికుదురు బస్టాండ్ కూడలిలో గురువారం విజయోత్సవం నిర్వహించారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



నగరంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న సీఎంఓ సుబ్రహ్మణ్యం

మామిడికుదురు: విద్యార్థులకు అవసరమైన మౌళిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్షా జిల్లా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. ఆయన నగరం ప్రధాన ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ప్రభుత్వం ఉచితంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను అందిస్తోందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే అన్ని రకాలు ఈ కిట్లలో ఉన్నాయని చెప్పారు. ఎంఈఓ–2 మోకా వెంకన్నబాబు, హెచ్ఎం బావిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరిపాలన అధికారిగా బాధ్యతల స్వీకరణ



పోచిరాజు లక్ష్మీ కృష్ణకుమారి

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ పరిపాలన అధికారిగా పోచిరాజు లక్ష్మీకృష్ణకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆమె అమలాపురం మండల ప్రజా పరిషత్ పరిపాలన అధికారిగా పనిచేసి అయినవిల్లికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన జి.వెంకట సరోవర రావు అయినవిల్లి ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. దీంతో మండల పరిషత్ పరిపాలన అధికారిగా లక్ష్మీ కృష్ణకుమారి బాధ్యతలు స్వీకరించారు.

అంతర్వేది దేవస్థానం ఏసీగా ప్రసాద్



అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తొలుత స్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో అర్చకుల వేదమంత్రాల మధ్య బాధ్యతలు తీసుకున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సఖినేటిపల్లి: మండలంలోని గుడిమూల, రామేశ్వరం, గొంది గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్) గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుడిమూలలో సబ్‌స్టేషన్ పరిధి 33 కేవీ న్యూ లైను వర్క్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని అన్నారు.

చదువుకొనే రోజులివి..

- ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పెరిగిన ఫీజులు
- పుస్తకాల ధర మరింత రెట్టింపు
- అమ్మో.. జూన్ అంటున్న సామాన్యులు



కొత్తపేట: వేసవి సెలవులు ముగిశాయి. పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఏటా పెరుగుతున్న ఫీజులు, పుస్తకాల ధరలు చూసి మధ్య తరగతి ప్రజలు భయపడుతున్నారు. బ్యాగు, యూనిఫాం, టై, బెల్టు, షూ వంటి ధరలు కూడా ఎప్పటికప్పుడు పెరిగిపోతున్నాయి. పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలని మధ్యతరగతి కుటుంబాల్లో తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఏదో విధంగా కష్టపడి ఫీజులు కట్టవచ్చని ప్రైవేట్ స్కూల్స్ వైపు మక్కువ చూపుతున్నారు. తమ పిల్లలకు ఐదేళ్లు, కొందరైతే నాలుగో సంవత్సరం నిండగానే ఏ పాఠశాలలో వేయాలి? ఎక్కడ బాగుంటుంది? అలాగే వాటి పదో తరగతి పూర్తయింది. ఏ కళాశాలలో జాయిన్ చేయాలని ఆలోచిస్తున్నారు.. ఇలా పలువురిని ఆరా తీస్తున్నారు. అందుకు అవసరమయ్యే ఖర్చును సర్దుబాటు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గురువారం పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై దృష్టి సారించారు.

జూన్ నెలంటే భయం..

మధ్య తరగతి కుటుంబాల వారికి జూన్ నెల వచ్చిందంటే ఎక్కడ లేని భయం పట్టుకుంటుంది. ఈ నెలలో ఖర్చులు తడిసి మోపెడవుతుంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయ కుటుంబాలే. ఓ పక్క వ్యవసాయ సాగు ప్రారంభం, మరో పక్క పాఠశాలల పునః ప్రారంభం, అప్పోసప్పో చేసి తమ బిడ్డలను మంచి ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. కాగా ప్రస్తుతం ఖరీఫ్ (తొలకరి) సీజన్ ప్రారంభవేళ వ్యవసాయ పనులకు, తమ పిల్లల స్కూలు ఫీజులు, పుస్తకాలు తదితర వస్తువులకు డబ్బులు చూసుకోవాలని తల్లిదండ్రుల్లో ఆలోచన మొదలైంది. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు వివిధ పాఠశాలలు నిర్వహిస్తున్నాయి. సంవత్సరం ఫీజును మూడు, నాలుగు వాయిదాల్లో చెల్లించాలి. అనాదిగా దాదాపు ప్రతి మండలంలో సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న రెండు, మూడు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలైతే తల్లిదండ్రుల ఆర్థిక స్థితిగతులను బట్టి కొన్ని మినహాయింపులు ఇస్తున్నాయి. ఎన్ని వాయిదాల్లో చెల్లించినా, ఎంత చెల్లించినా ఫర్వాలేదులేనని చదువు చెప్పి ప్రోత్సహిస్తున్నాయి. కానీ ఇతర ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం కచ్చితంగా మూడు వాయిదాల్లో చెల్లించాలని, పుస్తకాలకు మొత్తం చెల్లించాలని చెబుతున్నాయని పలువురు తల్లిదండ్రులు తెలిపారు.

సామాన్యులకు ఆర్థిక భారం

ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకూ సుమారు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకూ ఫీజులు ఉన్నాయి. బుక్స్‌కు సుమారు రూ.2 వేలు నుంచి రూ.3 వేల వరకూ తీసుకుంటున్నారు. అదే కార్పొరేట్ స్కూళ్లలో సుమారు రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకూ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇక మార్కెట్లో స్టేషనరీ, రెడీమేడ్ దుస్తులు, క్లాత్ షాపులు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు కావాల్సిన వస్తువుల షాపులు, షూ మార్టులు కొనుగోళ్లతో సందడి నెలకొంది. నోట్ బుక్స్ ధర రూ.20 నుంచి రూ.25 కాగా, బ్యాగులు రూ.200 నుంచి రూ.500 వరకు, షూ రూ.300 నుంచి రూ.600 వరకూ, రెండు జతల స్కూల్ డ్రెస్‌లతో పాటు ఒక వైట్ డ్రెస్, ఒక టీషర్టు సుమారు రూ.4 వేలు వరకూ ఉంటున్నాయి. ఆటో లేదా ఇతర స్కూల్ బస్ చార్జీలు నెలకు రూ.600 నుంచి రూ.1,000 వంటి వాటితో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు సుమారు రూ.18 వేల నుంచి రూ.28 వేల వరకూ, కార్పొరేట్ స్కూల్స్‌లో సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ ఖర్చు కావడంతో తల్లిదండ్రులకు చుక్కలు కనబడుతున్నాయి. అంతంత మాత్రం ఆదాయం గల కుటుంబాలకు పిల్లల చదువులు పెనుసవాల్‌గా మారింది. మొత్తం మీద పిల్లలు చదువుకున్నట్టు లేదని, వారికి చదువు 'కొన్నట్లు' ఉందని పలువురు వాపోతున్నారు.



ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు (ఫైల్)



ఒక ప్రైవేట్ బుక్ షాపులో విక్రయానికి సిద్ధం చేసిన బుక్స్

పలువురికి పరామర్శ



తులసీబాయి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అంబాజీపేట: పుల్లేటికుర్రులో మాతృ వియోగంతో బాధపడుతున్న నీతిపూడి వెంకటరమణను జెడ్పీటీసీ, పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు గురువారం పరామర్శించారు. తులసీబాయి మృతదేహం వద్ద నివాళులర్పించి వెంకటరమణకు మనోధైర్యం కల్పించారు. మాచవరంలో పార్టీ నాయకుడు కుసుమ సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఇటీవల ఎస్.యానం వద్ద సముద్రంలో ప్రమాదవశాత్తు పడి యాళ్ల హరికిషోర్ మృతి చెందగా, ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, దొమ్మేటి సత్యమోహన్, సూదాబత్తుల రాము, మట్టపర్తి బాలాజీ, ఉందుర్తి నాగబాబు, కుసుమ శ్రీను, వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, అందె వెంకటముక్తేశ్వరరావు, చిట్టూరి రాధాభాయ్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

మానసిక శక్తి బలమైంది



కొత్తపేట ఓంశాంతి భవనంలో యోగా సందేశం ఇస్తున్న రాజయోగిని రజని

కొత్తపేట: మానవులకు శారీరక శక్తి కంటే మానసిక శక్తి బలమైందని రాజయోగిని బ్రహ్మకుమారి రజని అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కొత్తపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఓంశాంతి భవనం వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, ఏజెన్సీ జిల్లాల రాజయోగ టీచర్, బ్రహ్మకుమారి రజని 'రాజయోగ విశిష్టత', నిత్య జీవితంలో మెడిటేషన్ ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, శారీరక, మానసిక బలం తదితర అంశాలపై ప్రత్యేక సందేశం ఇచ్చారు. యోగాతో ఏకాగ్రత, సృజనాత్మకత సాధించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాకు ముఖ్యంగా మెడిటేషన్‌కు కొంత సమయం కేటాయించాలని బ్రహ్మకుమారి రజని సూచించారు. ముందుగా శివ పరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట శాఖ 36వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి భవానీ, అన్నాజీ, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ సభ్యుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



దాత శరణ్య, సంయుక్తలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన గుంటూరి శరణ్య, సంయుక్తలు రూ.10,371, అమలాపురానికి చెందిన మంగెన దీపక్ ఫణీంద్రలు రూ.10 వేల విరాళం సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు ఇచ్చారు. దాతలను సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

సేవలు అభినందనీయం



కొత్తపేటలో బాధిత గర్భిణి తల్లికి చెక్కు అందజేస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

కొత్తపేట: జితేంద్ర సేవా ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. కొత్తపేట శివారు రామారావుపేటకు చెందిన సొంగ నాగరాజు, నాగమణి దంపతుల కుమార్తె ప్రణీత 7 నెలల నిండు గర్భిణీ. ఆమె తీవ్రమైన పిట్స్‌తో బాధపడుతుంది. ఇటీవల సీరియస్ కావడంతో తల్లీ బిడ్డ ప్రాణానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని వైద్యులు తెలిపారు. దీంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుండడంతో జితేంద్ర వాట్సాప్ గ్రూప్స్‌లో పెట్టారు. ఇలా దాతల ద్వారా సమకూర్చిన రూ.2 లక్షలను సేవా ఫౌండేషన్ చైర్మన్ మట్టపర్తి జితేంద్రకుమార్ గురువారం చెక్కు రూపంలో రెడ్డి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా బాధిత గర్భిణి తల్లిదండ్రులకు అందజేశారు. ఉప సర్పంచ్ విళ్ల మారుతిప్రసాద్, కెనరా బ్యాంక్ మేనేజర్ పెండే రాజేష్, కళాస్రవంతి కళాకారుల సంఘం అధ్యక్షుడు కొమారిపాటి ఏసు వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్ కల్చర్ యూనిట్‌తో ఉపయోగాలు



పెదపట్నంలో కేజ్ కల్చర్ యూనిట్‌ను పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం నాయుడు

మామిడికుదురు: కేజ్ కల్చర్ యూనిట్‌తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని నాబార్డు డీడీఎం సోమునాయుడు తెలిపారు. పెదపట్నం గ్రామంలోని గోదావరి ప్రాంతంలో సాగు చేస్తున్న కేజ్ కల్చర్ యూనిట్‌ను ఆయన గురువారం పరిశీలించారు. గోదావరి ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీఓ) రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుందని, దీని ఆధారంగా కేజ్ కల్చర్ మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే ఎఫ్‌పీఓ మెంబర్ షిప్ కూడా ప్రారంభమైందని చెప్పారు. ఈ నమోదు వల్ల భవిష్యత్తులో జరిగే నాబార్డ్ కార్యక్రమాల్లో మరియు ఫిష్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. కేజ్ కల్చర్ నిర్వాహకుడు లక్ష్మీనారాయణ, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ కొల్లు శివరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు



దిండిలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న సర్పంచ్ శ్రీనివాసరాజు, చిన్నారులు



అప్పనపల్లిలో చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

మామిడికుదురు: చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమాన్ని గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. మామిడికుదురు, అప్పనపల్లి, పాశర్లపూడి, బి.దొడ్డవరం, పెదపట్నం లంక, పాశర్లపూడిలంక, మగటపల్లి, మొగలికుదురు, ఆదుర్రు గ్రామాల్లో సామూహిక అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. 3–5 ఏళ్ల లోపు పిల్లలను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈఓ లక్ష్మీనారాయణ సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కొనుకు ప్రేమజ్యోతి, గౌస్ మొహిద్దీన్, బళ్ల శ్రీనివాస్, కడి అరుణకుమారి, ఎంపీటీసీ వర్దినేని రాము, సూపర్‌వైజర్లు ఎస్.సుబ్బలక్ష్మి, పి.విజయలత, బి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

దిండిలో గ్రాడ్యుయేషన్ డే

మలికిపురం: దిండి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే జరిగింది. సర్పంచ్ ముద్దనూరు శ్రీనివాసరాజు పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ ఫలాలను అందుకోవాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.హైమావతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి



చింతలూరులో సామూహిక అక్షరాభ్యాసాలు చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆలమూరు: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి, ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. చింతలూరులోని 171వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమాన్ని సీడీపీఓ గజలక్ష్మి ప్రారంభించగా మాజీ ఎంపీటీసీ గుత్తుల విశ్వేశ్వరరావు అంగన్‌వాడీ చిన్నారులకు పలకలు అందజేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఆలమూరులోని ఖండ్రిగపేట వద్ద 168వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాజు ప్రారంభించారు. సూపర్‌వైజర్లు టీఎస్వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, బి.వరలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పి.కృష్ణవేణి, సంధ్యారాణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

అంబాజీపేట: పాఠశాలలు పునః ప్రారంభం సందర్భంగా గంగలకుర్రు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వీఎస్‌వీ మహాలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. ఈ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు చిన్నారులు ఇష్టపడే విధంగా ఆటపాటలతో విద్యాబోధనపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

రేపటి నుంచి బస్సు పాస్‌ల జారీ

రాజోలు: ఈ నెల 14వ తేదీ నుంచి విద్యార్థులకు బస్సు పాస్‌లు మంజూరు చేస్తామని రాజోలు ఆర్టీసీ డిపో మేనేజర్ పి.ధనమ్మ గురువారం తెలిపారు. విద్యార్థులు పాస్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ప్రింట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం చేయించాలన్నారు. అలా సంతకం చేయించిన ప్రింట్ కాపీని ఆర్టీసీ బస్టాండ్‌లోని కౌంటర్ వద్ద సమర్పించాలన్నారు. 12 ఏళ్ల బాలురకు, 16 ఏళ్ల బాలికలకు ఉచిత బస్సు ప్రయాణ పాస్‌లు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99592 25579 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఈ-శ్రమ్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



ఆలమూరులో పెయింటర్స్ అండ్ వర్కర్స్ గుర్తింపు పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ రాజు

ఆలమూరు: భవన నిర్మాణ కార్మికుల జీవనోపాధితో పాటు ఆపద సమయంలో ఆదుకునే ఈ–శ్రమ్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇటీవల నూతనంగా ఎంపికైన స్వయంకృషి పెయింటర్స్ అండ్‌వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గుర్తింపు ధ్రువపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–శ్రమ్ కార్డును తీసుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి కార్మికులు అనేక రాయితీలు పొందవచ్చన్నారు. అలాగే పోస్టాఫీస్‌లో రూ.750 చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సౌలభ్యం, సౌకర్యం కోసం తమ వంతు సహకారం అందిస్తామని ఎంపీడీఓ రాజు తెలిపారు.

- మండల పెయింటర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ర్యాలీ సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా పెందుర్తి సురేష్, కార్యదర్శిగా వై.శామ్యూల్, సంయుక్త కార్యదర్శిగా గంటా మధు, కోశాధికారిగా యార్లగడ్డ మనోహర్, సభ్యులుగా కుడెల్లి సూరిబాబు, నరుకుర్తి శ్రీనివాస్, రేలంగి హేమంత్, నేతల నరేష్, బుంగ విజయ్‌బాబు నియమితులయ్యారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



గుమ్మిలేరులో విద్యార్థి మిత్ర కిట్లను అందజేస్తున్న సర్పంచ్ రాంబాబు తదితరులు

ఆలమూరు: గుమ్మిలేరులో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ జరిగింది. ఆ పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు బి.రామయ్య చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ గుణ్ణం రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు కిట్లను అందజేశారు. అనంతరం విద్యార్థి మిత్ర కిట్లలో ఉన్న పాఠ్య, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్సు, డిక్షనరీలు, బ్యాగులు, బెల్టులు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్య పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోమల నిర్మూలన మనందరి బాధ్యత



పెదపట్నంలంకలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మామిడికుదురు: దోమల నిర్మూలన మనందరి బాధ్యతగా గుర్తించాలని హెల్త్ అసిస్టెంట్ కేవీ సూర్యనారాయణ సూచించారు. నగరం పీహెచ్‌సీ పరిధిలోని పెదపట్నంలంక గ్రామంలో గురువారం మలేరియా వ్యాప్తి, దాని నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. మలేరియా నిర్మూలన మనతోనే సాధ్యమని నినాదాలు చేశారు. ఇళ్ల వద్ద మురుగు నీటి గుంటలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల ద్వారా ఎన్నో వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని చెప్పారు. వాటి నిర్మూలనతో సంపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఏఎస్ఎంలు పి.నాగమణి, తల్లీనాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ నాగదుర్గ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మేడిది సీత పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ అధికారిగా సుజాత



ఆలమూరు: స్థానిక సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీఓ)గా వి.సుజాత గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆమె రాజమహేంద్రవరం ఎస్‌టీఓగా పనిచేస్తూ బదిలీపై ఆలమూరు ఎస్‌టీఓ కార్యాలయానికి వచ్చారు. స్థానిక ఎస్‌టీఓగా ఇప్పటి వరకూ పనిచేసిన హైదర్ అలీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరుకు బదిలీపై వెళ్లారు. తమ శాఖ పరిధి మేరకు విధులు సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు పరిపూర్ణమైన సేవలు అందిస్తానని సుజాత తెలిపారు. అలాగే దీర్ఘకాలిక సమస్యలు ఉన్నట్లయితే జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు



మల్లికార్జునరావును సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ సిబ్బంది

అంబాజీపేట: ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని మార్కెట్ కమిటీ కార్యదర్శి ఐ.రమేష్ అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో ఆరేళ్లుగా జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ నగరం మార్కెట్ యార్డుకు బదిలీపై వెళ్తున్న ఎంవీఎస్‌కే మల్లికార్జునరావుకు సన్మాన సభ గురువారం జరిగింది. మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్లు బీఎస్ఎన్ కుమార్, పి.పరుశురాముడు తదితరులు పాల్గొన్నారు.